కథా కౌముది



# నవ్విన వారికి నవ్వినంత.. పాలపర్తి జ్యోతిష్మతి

పొద్దున్నే లేవగానే టింకూ నిద్రపోతున్న సుబ్బారావు దగ్గరికెళ్ళి చెవిలో రహస్యంగా ‘‘తాతయ్యా! తాతయ్యా!’’ అని పిలిచాడు. సుబ్బారావు కదల్లేదు. టింకూ ‘‘తాతయ్యా...!’’ అంటూ గట్టిగా అరిచాడు. ఉలిక్కిపడి లేచాడు సుబ్బారావు. టింకూ దూరంగా వెళ్ళి చప్పట్లు కొడుతూ ‘‘తాతయ్య భయపడ్డాడు, తాతయ్య లేచాడు” అంటూ గట్టిగా నవ్వాడు.

‘‘ఏంట్రా ఆ అరుపులు, ఆ నవ్వులు? చేతికందితే వీపు పగిలిపోయేది” అంటూ మండిపడ్డాడు సుబ్బారావు లేచి కూర్చుంటూ. టింకూ సుబ్బలక్ష్మి వెనక దాక్కున్నాడు.

ఎదురుగా నిలబడ్డ కొడుకుని చూసి ‘‘ఏరా చింటూ, ఎప్పుడొచ్చారు?’’ అని అడిగాడు సుబ్బారావు.

‘‘మా నాన్న పేరు చింటూ కాదు, శంకర్” రోషంగా అన్నాడు టింకూ ముందుకొచ్చి.

‘‘అబ్బా మాకు తెలీదులే” అన్నాడు సుబ్బారావు వెక్కిరింపుగా. టింకూ మళ్ళీ సుబ్బలక్ష్మి వెనక్కి చేరాడు మూతి ముడుచుకుని.

‘‘నిన్ను ఇప్పుడు టింకూ అనట్లేదూ? అట్లాగే ‘చింటూ’ మీనాన్న చిన్నప్పటి పేరు. నువ్వు మీ నాన్నంత అయ్యాకకూడా నిన్ను టింకూ అనే పిలుస్తాం” అన్నాడు సుబ్బారావు టింకూని ఉడికిస్తూ.

నేను మా నాన్నంత అయ్యేటప్పటికి నువ్వు...’’అని టింకూ ఏదో అనబోతుంటే లత కొడుకు నోరు మూసేసి అవతలికి లాక్కెళ్ళింది.

‘‘రాత్రే వచ్చాం నాన్నా! మేం వచ్చేటప్పటికి నువ్వు నిద్రపోయావు. టింకూకి నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. నాకూ శని, ఆదివారాలు సెలవే. ఇంకో రెండురోజులు పెట్టుకుంటే నాలుగు రోజులు మీతో గడపొచ్చు కదాని సెలవు పెట్టి వచ్చేశాము” అన్నాడు శంకర్.

‘‘ఇద్దరూ ‘సర్ప్రైజ్ చెయ్యాలి, సర్ప్రైజ్ చెయ్యాలి’ అంటూ ఫోన్ చెయ్యనివ్వలేదు మామయ్యా. ‘వెళ్ళేటప్పటికి లేటయిపోతుంది, నిద్రపోతారు, వస్తున్నామని ముందే చెప్తే బాగుంటుంది’ అంటే కూడా ఒప్పుకోలేదు’’ టింకూని చెయ్యి పట్టుకుని లాక్కొస్తూ ఫిర్యాదుగా అంది లత.

‘‘పొద్దున్నే చీకటితో బయలుదేరదా మనుకున్నాం. వీడు ఊరుకుంటేనా! రాత్రికే వెళ్ళిపోవాలని గోల. స్కూలునించి రాగానే నాకు ఫోన్ చేసి ‘వెంటనే వచ్చెయ్, బయల్దేరదాం’ అంటూ ఊపిరాడనివ్వలేదు. నేను హడావిడిగా ఆఫీసులో పని కట్టేసి పరుగెత్తు కొచ్చాను’’ చెప్పాడు శంకర్.

‘‘ఇప్పుడు మనం శ్రీశైలం వెళ్ళాలి తాతయ్యా! తొందరగా లే’’ అంటూ సుబ్బారావు పక్కకి చేరాడు టింకూ.

‘‘అన్నిటికీ తొందరే వీడికి’’ అంటూ టింకూ వీపుమీద చిన్నగా ఒక దెబ్బ వేసి, ‘‘టిఫిన్ చేసి నిదానంగా పది దాటాక బయలు దేరదాంలే నాన్న! వెళ్ళి రూం తీసుకుని, అటూఇటూ తిరిగి, చూడవలసిన వేవైనా చూసి, రాత్రికి ఉండి రేపు పొద్దున్నే దర్శనం చేసుకుని వచ్చేద్దాం’’ అన్నాడు శంకర్.

‘‘మనం గబగబా రెడీ అయిపోదాం రారా’’ అంటూ టింకూని పట్టుకుని హుషారుగా మంచం దిగాడు సుబ్బారావు.

‘‘వాదించుకుంటారు, అరుచుకుంటారు, చివరికి తాతా మనవడూ ఒకటైపోతారు’’ మురిపెంగా అంది సుబ్బలక్ష్మి.

అంతా తయారై కారెక్కేటప్పుడు సుబ్బారావు ‘‘నేను, నా మనవడు వెనక కూర్చుని కబుర్లు చెప్పుకుంటాం’’ అంటూ వెనక సీటు ఆక్రమించాడు.

శంకర్ డ్రైవ్ చేస్తుంటే పక్కన లత కూర్చుంది. వెనక సుబ్బలక్ష్మికి, సుబ్బారావుకి మధ్యలో కూర్చుని ఏవేవో కబుర్లు చెప్తూ టింకూ పడీపడీ నవ్వుతున్నాడు.

‘‘ఎందుకురా అట్లా నవ్వుతావు. అంతలా నవ్వకూడదు. మంచిది కాదు’’ అంటూ మధ్యమధ్యలో సుబ్బారావు టింకూని కోప్పడుతున్నాడు.

‘‘నవ్వితే తప్పేంటి తాతయ్యా!’’ ఆశ్చర్యంగా అడిగాడు టింకూ.

‘‘అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు పెద్దలు. నవ్వుకైనా అది వర్తిస్తుంది. పెద్దవాళ్ళు చెప్పింది మనం పాటించాలి’’ అన్నాడు సుబ్బారావు సీరియస్‌గా.

‘‘నీకంటే పెద్దవాళ్ళా తాతయ్యా వాళ్ళు’’ కొంటెగా అడిగాడు టింకూ.

‘‘ష్....’’ అంటూ వెనక్కి తిరిగి వారించింది లత.

అట్లా టింకూ నవ్వులతో, సుబ్బారావు హెచ్చరికలతో, లత, సుబ్బలక్ష్మిల మందలింపులతో ప్రయాణం సాగి శ్రీశైలం చేరుకున్నారు. అనుకున్న ప్రకారం కార్యక్రమాలన్నీ పూర్తిచేసుకుని మర్నాడు పొద్దున్న తిరుగు ప్రయాణ మయ్యారు.

‘‘రా తాతయ్యా! నిన్నట్లాగే వెనక కూర్చుని మనిద్దరం కబుర్లు చెప్పుకుందాం’’ అన్నాడు టింకూ.

‘‘లేదురా! ఇవాళ నేను ముందు కూర్చుంటాను. కొండ దిగడం కదా! పక్కన కూర్చుని నాన్న జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యడానికి సలహా లివ్వాలి” అన్నాడు సుబ్బారావు ముందు సీట్లో కూర్చుంటూ.

‘‘అవునవును. అక్కడ ఏం లేకపోయినా ‘చూసుకో, చూసుకో, జాగ్రత్త, జాగ్రత్త’ అంటూ వాణ్ణి కంగారు పెట్టడానికి మీరు ముందే కూర్చోవాలి” అంది సుబ్బలక్ష్మి.

లత ముసిముసిగా నవ్వింది. టింకూ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వు ఆపుకున్నాడు.

‘‘ప్రతిమాటకీ అంత నవ్వేందు కొస్తుంది?’’ చిరాకుపడ్డాడు సుబ్బారావు కదలకుండా కూర్చుని.

కారు కదిలిన కాసేపటికే సుబ్బారావు నిద్రపోయాడు. నలుగురూ చుట్టూ అడవిని చూస్తు, కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ వెళ్తున్నారు. సుబ్బలక్ష్మి, శంకర్, లత చిన్నగా నవ్వుతుంటే టింకూ గట్టిగా చప్పట్లు కొడుతూ నవ్వుతున్నాడు.

‘‘అంత గట్టిగా నవ్వకురా, తాతయ్యకి మెలకువ వస్తే కోప్పడతారు” అంది లత టింకూతో.

‘‘తాతయ్యకి మెలకువ రావాలనే నేను కావాలని గట్టిగా నవ్వుతున్నాను” అన్నాడు టింకూ.

లత టింకూకి ఒక్కటంటించబోయి, టింకూ మాటలకి గట్టిగా నవ్వుతున్న సుబ్బలక్ష్మి, శంకర్‌లతోబాటు తనూ నవ్వేసింది.

సుబ్బారావు ఉలిక్కిపడి లేచి ‘‘ఏంటి గోల? వాణ్ణి ప్రశాంతంగా డ్రైవ్ చెయ్యనివ్వరా? నువ్వైనా ఏంట్రా? దిక్కులు చూస్తు, జోకులేసుకుంటూనా కారు నడిపేది? ముందు చూసి జాగ్రత్తగా పోనీ” అంటూ అందరిమీదా అరిచాడు.

‘‘ఏం ఫరవాలేదు నాన్నా! నేను మాట్లాడుతున్నా, నవ్వుతున్నా జాగ్రత్తగానే డ్రైవ్ చేస్తాను. నువ్వు పడుకో. నిన్ను క్షేమంగా ఇల్లు చేర్చే బాధ్యత నాది” అన్నాడు శంకర్.

అందరూ మూతి బిగబట్టుకుని నవ్వు ఆపుకుని నిశ్శబ్దం అయిపోయారు కాసేపు. సుబ్బారావు కళ్ళు మూసుకోగానే మళ్ళీ వాళ్ళ కబుర్లు, నవ్వులు కొనసాగాయి.

ఇల్లు చేరి, సేదదీరి రాత్రికి పక్కలమీదికి చేరారు అందరూ. సుబ్బారావు తన పడగ్గదిలోనే పడుకున్నాడు. మిగతా వాళ్ళంతా హాల్లో కింద పక్కలు వేసుకుని వరసగా పడుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

‘‘బామ్మా! నవ్వితే తాతయ్యేందుకు అంత చిరాకు పడతాడు?’’ అని అడిగాడు టింకూ సుబ్బలక్ష్మిని.

‘‘చిన్నప్పుడు తాతయ్యకూడా జోకులేస్తూ సరదాగానే ఉండేవాడురా. ఇప్పుడైనా హుషారు మూడ్‌లో ఉంటే నవ్వుతూ కబుర్లు చెప్తాడు. కానీ అటువంటి సందర్భాలు తగ్గిపోతున్నాయి, పెద్దతనంవల్ల” అన్నాడు శంకర్.

‘‘కొంతమందికి పడీపడీ నవ్వితే నచ్చదురా! నా చిన్నప్పటి విషయం చెప్తా విను” అంది సుబ్బలక్ష్మి.

టింకూ ఠక్కున లేచి సుబ్బలక్ష్మి పక్కకి చేరాడు ‘‘చెప్పు, చెప్పు” అంటూ.

‘‘చిన్నప్పుడు సెలవలకి మా అమ్మతో కలిసి మా అమ్మమ్మా వాళ్ళింటికి వెళ్ళేదాన్ని. అక్కడ పక్కింట్లో నాయీడు అమ్మాయి ఉండేది. ఇద్దరం బాగా స్నేహంగా ఉండేవాళ్ళం. కలిసి ఆడుకునేవాళ్ళం. ఆ అమ్మాయి పేరుకూడా సుబ్బలక్ష్మే.

ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం 'సుబ్బూ', 'సుబ్బూ' అని పిలుచుకుంటూ తెగ నవ్వుకునేవాళ్ళం. దానికి నవ్వెక్కువ. ఒకసారి మొదలయిందంటే ఒకపట్టాన ఆగదు. దాని నవ్వు చూస్తే నాకూ నవ్వు వచ్చేది. ఇద్దరం అట్లా విపరీతంగా నవ్వుకుంటుంటే మా అమ్మకి, అమ్మమ్మకి కోపమొచ్చేది. 'ఏంటా వెకిలి నవ్వులు. ఆడపిల్లలట్లానేనా నవ్వేది' అని అరిచేవాళ్ళు. 'ఎట్లా నవ్వాలో చెప్పచ్చుగా, అట్లాగే నవ్వుతాం' అని అది నా చెవిలో గొణిగేది. పెద్దవాళ్ళ కోపం చూసి ఆగిపోయిన నా నవ్వు మళ్ళీ మొదలయ్యేది. ఒక్కోరోజు అది వాళ్ళింట్లోనించి కళ్ళల్లో నీళ్ళు వచ్చేటట్టు నవ్వుతూ పరిగెత్తుకుంటూ మా ఇంటికి వచ్చేది. 'ఇంట్లోంచి రావడమే అట్లా నవ్వుతూ వస్తావేంటే?' అని అడిగేదాన్ని. 'మా అమ్మకి, బామ్మకి నవ్వితే అస్సలు నచ్చదు. మీ అమ్మ, అమ్మమ్మలాగే మండిపడతారు. నాకు నవ్వొచ్చే విషయాలు ఏవేవో గుర్తొస్తాయి. నవ్వు మొదలవగానే బాత్రూంలో కెళ్ళి తలుపేసుకుని నవ్వుకుంటాను. ఒక్కోసారి నవ్వి నవ్వి దెబ్బలుకూడా తింటాను. నువ్వుంటే మీ ఇంటికి వస్తాను, ఇద్దరం కలిసి నవ్వుకోవచ్చు అని' అంది అట్లా నవ్వుతూనే. షరా మామూలే! దాని నవ్వు చూసి నేనుకూడా దానిలాగే నవ్వేదాన్ని. మమ్మల్ని చూసి మా అమ్మ, అమ్మమ్మ శివాలెత్తి పోయేవాళ్ళు. మే మిద్దరం పరుగుపరుగున దొడ్లోకి పారిపోయేవాళ్ళం. మా అమ్మమ్మవాళ్ళ ఇంటి వెనక పెద్ద దొడ్డి ఉండేది. దాంట్లో పెద్ద పెద్ద చెట్లుండేవి. చెరో చెట్టు చాటున దాక్కుని, నవ్వి నవ్వి, ఉద్ధృతి తగ్గాక ఇవతలి కొచ్చి ఒకళ్ళనొకళ్ళు చూసుకుని మళ్ళీ నవ్వుల పాలయ్యేవాళ్ళం. ఒకసారి మా అమ్మ దాన్ని ఏమీ అనలేక నా వీపు పగలగొట్టింది. కొంతమంది పెద్దవాళ్ళ కెందుకో నవ్వుతూ, తుళ్ళుతూ ఉండడం నచ్చదు'' చిన్నప్పటి ముచ్చటంతా నవ్వుతూ చెప్పింది సుబ్బలక్ష్మి.

''నువ్వు చిన్నప్పుడు అట్లా నవ్వులతో ఎంజాయ్ చేశావు కాబట్టి ఎవరైనా నవ్వుతుంటే నువ్వూ నవ్వుతావు. పాపం! తాతయ్య చిన్నప్పుడు అంత నవ్వి ఉండడు. అందుకే నవ్వంటే కోపం తాతయ్యకి'' అన్నాడు టింకూ.

''బామ్మకి ఆ వీడియో చూపిద్దాం రారా'' అంటూ శంకర్ సెల్ తీశాడు.

నలుగురూ లేచి కూర్చుని సెల్‌లో వీడియో చూస్తున్నారు. 'ట్రైన్‌లో అందరూ సీరియస్ కూర్చుని ఉన్నారు. అంతలో ఒకతని సెల్ మోగింది. అతను మాట్లాడుతూ నెమ్మదిగా చిరునవ్వుతో మొదలు పెట్టి గట్టిగాగట్టిగా నవ్వుతున్నాడు సెల్‌లో మాట్లాడుతూనే. పక్కన కూర్చున్నతను ఇతన్ని మొదట చిరాగ్గా చూసి, తరువాత చిన్నగా నవ్వి అట్లా అట్లా పెద్ద నవ్వులోకి వెళ్ళిపోయాడు. అట్లా ఒకళ్ళని చూసి ఒకళ్ళు – కంపార్ట్‌మెంట్‌లోని వాళ్ళంతా విపరీతంగా నవ్వడమే.' ఆ వీడియో చూస్తూ చూస్తూ సుబ్బలక్ష్మి, శంకర్, లత, టింకూ వీడియోలోని వాళ్ళలాగే నవ్వడం మొదలు పెట్టారు.

''ఏంటా నవ్వులు, నిద్ర పోకుండా'' అన్న సుబ్బారావు అరుపుకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు నలుగురూ.

''యూట్యూబ్ సెర్చ్‌లో 'కంటేజియస్ లాఫ్టర్' అని కొడితే చాలా వీడియోలు వస్తాయి తాతయ్యా! అవి చూస్తున్నాం. అవి చూస్తే ఎవరైనా నవ్వకుండా ఉండలేరు'' అన్నాడు టింకూ. మిగతా ముగ్గురూ పెదాలు బిగించి నవ్వు ఆపుకుంటున్నారు.

‘‘ఆఁ...! వస్తాయ్‌లే, టీవీలోకూడా లాఫ్టర్ థెరపీ అని, లాఫింగ్ క్లబ్ అని, రాని నవ్వుని తెచ్చిపెట్టుకుని నవ్వడం – చూడ్డానికే ఎబ్బెట్టుగా ఉంటుంది. నవ్వింది చాల్లే, ఇంక పడుకోండి’’ అని విసుక్కుని ‘వీడియోలు చూసి మరీ నవ్వాలా?’ అని గొణుక్కుంటూ గదిలో కెళ్ళిపోయాడు సుబ్బారావు.

‘‘ఏంటీ పడుకునేది? నువ్వు పెట్టే గురకకి మాకు నిద్ర పడుతుందా?’’ తాతయ్యని వెక్కిరిస్తూ అన్నాడు టింకూ.

‘‘చిన్నాపెద్దా లేకుండా ఏంటా మాటలు?’’ అంటూ కళ్ళెర్రచేసి టింకూ వీపుమీద దెబ్బ వెయ్యబోయింది లత.

టింకూ తప్పించుకుని తాతయ్య గదిలోకి పరిగెత్తాడు. వెళ్ళినవాడు ఎంతకీ బయటికి రాకపోయే సరికి లత లేచి లోపలి కెళ్ళబోతుంటే టింకూ పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి, ‘మాట్లాడొద్దు’ అన్నట్టు నోటిమీద వేలు పెట్టి సైగ చేసి, తన వెనకే రమ్మన్నట్టు చెయ్యి ఊపి మళ్ళీ లోపలి కెళ్ళాడు. వెనకే ముగ్గురూ వెళ్ళారు.

గదిలో సుబ్బారావు కుర్చీలో కూర్చుని సెల్‌లో ‘కంటేజియస్ లాఫ్టర్’ వీడియో చూస్తూ శబ్దం బయటికి రాకుండా చేత్తో నోరు నొక్కుకుంటూ, కదిలి కదిలి నవ్వుతున్నాడు.

★★★

COMMENTS